ప్రకృతి ప్రకోపం.. అన్నదాతకు శాపం

- వర్షాలకు నేలకొరిగిన వరి పంట
- నష్టాలపాలైన మండల రైతాంగం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వినతి


వరిలో మోసులు వచ్చిన పంటను చూపిస్తున్న రైతు నరసయ్య


నీటిలో కుళ్లిపోయిన వరిపంటను చూపిస్తున్న రైతు సిద్దవరం హరిబాబు

పెనగలూరు : అల్పపీడన ప్రభావంతో మండల వ్యాప్తంగా మూడు రోజులపాటు వర్షాలు భారీగా కురిశాయి. ఈ వర్షాల కారణంగా సిద్దవరం పంచాయతీలో వరి రైతులు నిలువునా అప్పుల్లో కూరుకుపోయారు. పంట చేతికంది ఒకటి, రెండు రోజుల్లో పంట ఇంటికి వస్తుందనుకున్న తరుణంలో వాయుగుండం రూపంలో వరి రైతులను ముంచేసింది. ఈ ఏడాది మోటార్ల కింద ముందుగానే వరిపంటను సాగు చేశారు. రైతులు ఐదునెలలపాటు కష్టపడినా ఫలితం లేకుండా పోయింది. వర్షం దాటికి ఎగువ సిద్దవరం, దిగువ సిద్దవరం, కోడి చెన్నయ్యగారిపల్లి గ్రామాలలో పంట నేలమట్టమైంది. బొప్పాయి రైతు పూర్తిగా నష్టపోయారు. దిగువ సిద్దవరంలో ఎక్కువగా కౌలు రైతులు వరిపంటను సాగు చేశారు. వరి పంట నేలపాలు కావడంతో ఇప్పటికే మోసులు వచ్చి పనికిరాకుండా పోయింది. దిగువ సిద్దవరంలో సిద్దవరం నరసింహులు, జోరోపల్లి రామచంద్ర, నరసింహులు, హరిబాబులతోపాటు అనేక మంది రైతులు ఎగువ సిద్దవరంలో అనేక మంది రైతులు వరి పంట వలన తీవ్రంగా నష్టపోయారు. భూ యజమానికి కౌలు ఇవ్వాలని, పెట్టిన ఖర్చులన్నీ బూడిదలో పోసినట్టు అయ్యిందని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గినా వరికోత కోసేందుకు కోత యంత్రాలు, ట్రాక్టర్లు పొలాల్లో దిగబడి పోతుండటంతో ఉన్న పంటకూడా దక్కుతుందా లేదా అన్న సందేహంలో రైతులు ఉన్నారు. ఈ వర్షానికి దాదాపు 80 ఎకరాలు వరిపైరు నేల వాలింది. కొంతమంది ఈకేవైసీ తీసుకోగా మరికొంత మంది ఈకేవైసీ చేసుకోలేదు. ఈకేవైసీ చేసుకోని వారి పరిస్థితి దయనీయంగా మారింది. మూడు రోజులపాటు 220 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరిపంటకు మంచి ధర పలుకుతున్న తరుణంలో వర్షాల వల్ల రైతులు నిండా మునిగిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరి పంట సాగు చేసిన రైతులకు రూ.కోటి వరకు నష్టం వాటిల్లింది. పంట దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎకరా పొలం వరి సాగు చేశాను. ఆరుగాలం కష్టించి పంటను కాపాడుకున్నా. తీర రెండు రోజుల్లో పంట చేతికొస్తుందనగా ప్రకృతి ప్రకోపం చూపింది. నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు పంట నాశనం అయ్యింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకుంటే తమ బతుకులపై అప్పుల భారం పెరిగిపోతుంది.

– లక్ష్మీదేవి, దిగువ సిద్దవరం

వరిపంటకు మోసులు వచ్చాయి



పంట పండి చేతికివచ్చే సమయంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు తీవ్రంగా నష్టపోయాం. ఒకటిన్నర ఎకరాలో వరిపంట నేలమట్టం కావడంతో మోసులు వచ్చి పనికిరాకుండా పోయింది. పెట్టుబడి అయినా దక్కుతుందని అనుకుంటే అప్పులు మిగిలాయి. వెంటనే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– గోర్ల సుధాకర్, కౌలురైతు, దిగువ సిద్దవరం

కౌలు రైతులకు పరిహారం ఇవ్వాలి



వరిపంటను ఎక్కువగా కౌలు రైతులు సాగు చేశాం. నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలకు వరిపైరు భూమిపై పడిపోయింది. చేతికొచ్చే పంట ఇలా దెబ్బతినడంతో మా ఆవేదన వర్ణనాతీతం. ఈ స్థితిలో ధాన్యాన్ని కొనేందుకు ఎవరు ముందుకు రారు. కౌలు రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలి.

– పులగూర వెంకటరమణ, కౌలు రైతు, దిగువ సిద్దవరం

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

పెనగలూరు : పెనగలూరులో సబ్ స్టేషన్ పరిధిలో నేడు శనివారం విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పెనగలూరు పి.కొత్తపల్లి, ఇండ్లూరు, సాతుపల్లి, బెస్తపల్లి, నారాయణ నెల్లూరు, ఓబిలి, కొండూరు, తిరునంపల్లి, సిరివరం, వెలగచర్ల, తిమ్మాయిగారిపల్లి, చక్రంపేట, కట్టావారిపల్లి, కాకర్లవారిపల్లి, గోవిందంపల్లి తదితర గ్రామాలలో విద్యుత్‌ను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని వారు తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

రోడ్డు పనులకు భూమిపూజ

పుల్లంపేట : మండలంలోని రెడ్డిపల్లి, రామసముద్రం గ్రామ పంచాయతీలలో రూ.28.75 లక్షలు సిమెంట్ రోడ్లకు మంజూరు అయ్యిందని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. శుక్రవారం రెడ్డిపల్లి, రామసముద్రంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం


బోరుకు మోటారు బిగిస్తున్న సిబ్బంది

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలోని ఆసాదివాండ్లపల్లిలో ఇటీవల పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరుకు శుక్రవారం సర్పంచ్ నాగార్జునాచారి గ్రామస్తులతో కలిసి మోటారు ఏర్పాటు చేసి ప్రజల నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజలు సర్పంచ్ సోమారపు నాగార్జునచారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఆర్.లోకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘన నివాళి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆకేపాటి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ బ్రహ్మంగారి వీధికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చొప్పా నరసింహారెడ్డి సతీమణి చొప్పా సుబాషిణి మృతి చెందడంతో ఆమె మృతదేహానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి నివాళి అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గొబ్బిళ్ల త్రినాథ్, అరిగెల సౌమిత్రి, నాయకులు గుండు మల్లికార్జునరెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, జి.నరసింహారెడ్డి, హెచ్.సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ ఇబ్బు, మధురాజు, రాజారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం


ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, బాలల లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణాపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం వలన అనారోగ్యం బారిన పడతారని, గృహ సింహకు గురవుతారన్నారు. చిన్న వయస్సులో గర్భం దాల్చి రక్తహీనతకు గురి కావడం, శిశు మరణాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. తదుపరి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయన్న, సంస్థ ప్రతినిధులు రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు


డొజర్‌తో మద్యం సీసాలను తొలగిస్తున్న ఎస్‌ఐ శివప్రసాద్

ఒంటిమిట్ట : బహిరంగ ప్రదేశాలలో ఎవరైనా మద్యం సేవిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని సాలాబాద్ గ్రామ శివారులో, ఇంకా మండల కేంద్రంలోని ఒంటిమిట్ట సమీపంలోని శ్రీ కోదండరామస్వామి నగర్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో మందుబాబులు మధ్యాహ్నం తాగి సీసాలను చల్లా చెదురుగా వేయడం చూసిన ఎస్‌ఐ శివప్రసాద్ వాటిని తొలగించే కార్యక్రమం చేశారు. ఇందులో భాగంగా డొజర్‌ని తీసుకు వచ్చి చల్లాచెదురుగా పడి ఉన్న మద్యం సీసాలను తీయించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూబీలోకి వర్షపునీరు


వర్షపు నీటితో నిండిపోయిన ఆర్‌యూబీ

ఓబులవారిపల్లె : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తిగా నిండిపోయింది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులు, పాఠశాలలు, రేషన్ షాపులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. అండర్ బ్రిడ్జి పూర్తిస్థాయిలో నిండిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పుల్లంపేటలో పారిశుధ్య పనులు


బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

పుల్లంపేట : సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పుల్లంపేటలోని మెయిన్ రోడ్డు, నాగలపురుగట్టు, సచివాలయంలలో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఏది?


మిరియాల సురేఖ

రాజంపేట రూరల్ : కూటమి ప్రభుత్వానికి మద్యం పాలసీపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై చూపకపోవటం సమంజసమా అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ నిలదీశారు. మన్నూరులో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జననేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందించారని కొనియాడారు. ఆ సమయంలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. నాడు జగనన్న సంక్షేమ పథకాలను అందిస్తూ పాలిస్తుంటే ప్రజలకు మేలు జరగటం ఇష్టం లేని కూటమి పార్టీ ప్రజలను సోమరులను చేస్తున్నారని ఆరోపించారని గుర్తు చేశారు. మరి కూటమి ప్రభుత్వం రూ.5 లకే భోజనం, వంద రూపాయలకే మద్యం అందజేయటాన్ని ఏమంటారని ప్రశ్నించారు. ఇటువంటి పథకాల ద్వారా ప్రజలు పనివంతులు అవుతారా అని ఎద్దేవా చేశారు. మీ దృష్టిలో సంపద పెంచడం అంటే నిత్యావసర ధరలు అమాంతం పెంచేయటమా అని ప్రశ్నించారు. మద్యం పాలసీ తేవడంలో చూపిన చొరవ నిత్యావసర సరుకుల ధరలు తగ్గించడంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో తరుణంలో బడి పిల్లలకు రూ.15వేలు, తల్లులకు రూ.18వేలు ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కరెంట్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు.. ప్రభుత్వంలోకి వచ్చాక చార్జీల పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయడాన్ని తప్పుబట్టారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహన తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మోహన్ నాయక్

వీరబల్లి : మండలంలో శుక్రవారం సాయంత్రం ఎస్‌ఐ మోహన్ నాయక్ తన సిబ్బందితో కలసి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వాహనాలు నడుపుతున్న వ్యక్తులకు లైసెన్సులు, ఆర్సీలు, ఇన్సురెన్సు పత్రాలను వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఎవరైనా నిబంధ నలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆలయ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే ఆకేపాటి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ట ప్రారంభంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ వారు ఘనంగా స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ శ్రీరాముడి ఆశీస్సులు ఎల్లవేళలా అందరికీ కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆకేపాటి వేణుగపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఒంటిమిట్ట: రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

నూతన వధూవరులకు ఆశీర్వాదం

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ చెరుకువాండ్లపల్లికి చెందిన వెంకటరమణ కుమార్తె వివాహ వేడుకలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామస్వామి రెడ్డి, బీఎల్ నరసింహారెడ్డి, సర్పంచ్ రామ జయచంద్ర, మాజీ సర్పంచ్ రమణ, రెహమాన్ ఖాన్, బాబు రెడ్డి పాల్గొన్నారు.

వివాహం జరిపించిన ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : కోనరాసపల్లి గ్రామానికి చెందిన నూతన వధూవరులు గంగయ్య, సునీతలకు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఉచిత వివాహం జరిపించి ఆశీర్వదించారు. ఆకేపాటి ఎస్టేట్ వద్ద నున్న వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయాలలో శుక్రవారం ఎమ్మెల్యే ఆకేపాటి దగ్గరుండి వీరికి వివాహం జరిపించారు. కోనరాసపల్లి గ్రామానికి చెందిన కదిరయ్య, కదిరమ్మల కుమారుడు గంగయ్యతో అదే గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, రెడ్డెమ్మల కుమార్తె సునీతకు ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు తాళిబొట్టు, చీరె, సారె అందజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

గాలివీడు : రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పేరంపల్లి గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో ఎక్కడైనా పొరపాట్లు జరిగినట్లు భావిస్తే, తాము నష్టపోయాం అనుకున్న భూ యజమానులు, రైతులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారునితో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రీ సర్వేలో భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పని లేకుండా గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయచోటి డివిజన్ ఇన్స్పెక్టర్ సర్వేయర్ గురివిరెడ్డి, ఆర్‌ఐ బాలాజీ, మండల సర్వేయర్ మురళీనాయక్, వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు, గ్రామ సర్వేయర్లు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్‌లను రెగ్యులర్ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్‌లు

రాయచోటి టౌన్ : కాంట్రాక్టు లెక్చరర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని రాయచోటి కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో పసుపు రిబ్బన్ ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నికల కోడ్ వలన తమ ఉద్యోగాలను రెగ్యులర్ ప్రక్రియ చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

నంబర్ ప్లేట్ తప్పక అమర్చుకోవాలి

రాయచోటి టౌన్ : ప్రతి వాహనదారుడు తప్పకుండా తమ వాహనానికి నంబర్ ప్లేట్ అమర్చుకోవాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి వాహనదారులకు సూచించారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలసి నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా వాహనాలు ప్రమాదాలకు గురైనా, చోరీకీ గురైనా నంబర్ ప్లేట్స్ లేకపోతే అలాంటి వాటిని గుర్తించడం చాలా కష్టమన్నారు. అంతే కాకుండా ట్రాఫిక్ నియమ, నిబంధనల ప్రకారం తప్పకుండా ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు నంబర్ ప్లేట్ అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జోసెఫ్, సిబ్బంది చంద్రశేఖర్, మనోహర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

గుండ్లకుంట కట్ట పరిశీలన


చెరువు కట్టను పరిశీలిస్తున్న తహసీల్దార్

రామాపురం : కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలి బిడికి సమీపంలోని గుండ్లకుంట కట్టను శుక్రవారం మండల తహసీల్దార్ రామాంజనేయులు పరిశీలించారు. గత మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు గుండ్లకుంట చెరువు నిండే అవకాశం ఉందని, కట్టకు రంధ్రం పడిందని రైతులు, ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే కట్టను పరిశీలించారు. ఎంఐ జేఈ మహబూబ్‌బాషాకు కట్టకు మరమ్మతులను చేపట్టాలని సూచించారు. ఆయన వెంట వీఆర్‌ఓలు నరసింహులు, రాధిక, రైతులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గాలివీడు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గాలివీడు సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం సందర్భంగా రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో 100 మంది మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ మహిళా రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం రెడ్స్ సంస్థ అధ్యక్షులు భానూజా మాట్లాడుతూ ఎఫ్‌పీఓలలో ప్రతి మహిళా చేరి వారి ఆర్థిక, సామాజిక పరమైన మార్పులు చేసుకోవాలని కోరారు. ఎఫ్‌పీఓ ద్వారా ఐదు రకాల మొక్కలు ఇస్తామని, వాటి ద్వారా ఆరు మాసాల నుండి ఆదాయం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం పెద్దరెడ్డయ్య, సంస్థ కో-ఆర్డినేటర్ రవీంద్ర, స్వాతి, భారతి, వెంకటయ్య, ఎల్లప్ప, ప్రకృతి వ్యవసాయం ఎంటీ రమణ, వెలుగు సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవమ్మ

సెమినార్లు, వర్క్‌షాపులతో ప్రయోజనం

రాయచోటి అర్బన్ : పలు అంశాలపై నిర్వహించే సెమినార్లు, వర్క్‌షాపులతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సాయి కళాశాల ఏడీ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాట్‌ల్యాబ్ అండ్ అప్లికేషన్స్ అనే అంశంపై రెండురోజుల వర్క్‌షాపును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొనడం వలన విద్యార్థులు అనేక అంశాలపై అవగాహన కల్పించుకోవచ్చునన్నారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై పట్టుసాధించగలుగుతారన్నారు. తమకు పట్టు ఉన్న అంశాలను ఇతరులకు వివరించడం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించవచ్చునన్నారు. అనంతరం వర్క్‌షాపుకు హాజరైన ప్రొద్దుటూరు గౌతమి కళాశాల విద్యార్థినులు మ్యాట్‌ల్యాబ్ ఆవశ్యకతను, దానివలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, ఈసీఈ విభాగాధిపతి చంద్రశేఖర్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వే జరిగిన గ్రామాల్లో సభలు


మురాషావలి, తహసీల్దారు

సిద్దవటం : మండలంలోని భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించాలని గ్రామ రెవెన్యూ సర్వేయర్లకు సూచించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం గ్రామ రెవెన్యూ సర్వేయర్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలను నిర్వహించాలన్నారు. మండలంలోని జంగాలపల్లె, ఎస్.రాజంపేట, మందపల్లి, శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామాల్లో 2023లో రీసర్వే నిర్వహించామన్నారు. ఆయా గ్రామాల్లో రైతుల అభ్యంతరాలు, సమస్యలు ఉంటే గ్రామ సభలో అర్జీలు సమర్పించాలన్నారు. శాఖరాజుపల్లెలో ఈ నెల 22,23,24 తేదీలలో, మందపల్లెలో 25,26 తేదీల్లో, ఎస్.రాజంపేటలో 28వ తేదీన, జంగాపల్లెలో 29,30 తేదీల్లో సభలను నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు తెలిపారు.

దెబ్బతిన్న వరి పంటల పరిశీలన


రాజంపేట రూరల్: అప్పారాజుపేటలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా డీఆర్‌సీలు

రాజంపేట రూరల్ : నీటిలో మునిగిన వరి గింజలు మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణంను స్ప్రే చేయాలని జిల్లా డీఆర్‌సీ ఏఓలు రామకృష్ణంరాజు, సుచిత్రలు రైతులను కోరారు. మండల పరిధిలోని పోలీ, అప్పారాజుపేట పంచాయతీల పరిధిలో నీట మునిగిన వరి పంటలను మండల వ్యవసాయ అధికారిణి గుజ్జల రాజకుమారితో కలసి శుక్రవారం పరిశీలించారు. వరి పొలంలోను ఉన్న నీటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అరటి పంటలను సందర్శించి అరటి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు రామకృష్ణమరాజు, సుచిత్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయి మహేశ్వరీ, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త మాధురీలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరికుప్పల మీద ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని, రబీలో సాగుచేసే వరి రకమైన ఆర్ఎన్ఆర్–15048 రకానికి ఎక్కువ మోతాదులో నత్రజని ఎరువులు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ జి.మల్లికార్జున, వీఏఏ సి.పుష్పాంజలి, రైతులు పాల్గొన్నారు.


నందలూరు: వరిచేనును పరిశీలిస్తున్న అధికారులు

ఆదాయవనరులపై పంచాయతీలు దృష్టి సారించాలి

లక్కిరెడ్డిపల్లి : సొంత ఆదాయ వనరులపై పంచాయతీలు దృష్టి సారించి గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలని డీఎల్‌పీఓ లక్ష్మీపతి పేర్కొన్నారు. మండలంలోని గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులపాటు శిక్షణా కార్యక్రమాలను స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ లక్ష్మీపతి మాట్లాడుతూ 1994 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలు కీలకపాత్ర పోషించాలని, పారిశుధ్యం, వ్యర్థపదార్థాల నిర్వహణపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు పరిపాలనపై అవగాహనను కచ్చితంగా పెంపొందించుకోవాలని రాయచోటి ఎంపీడీఓ కార్యాలయం పరిపాలనాధికారి మధుసూదన్‌రెడ్డి, పంచాయతీల విస్తరణాధికారి సురేష్‌బాబులు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పరిపాలనపై అవగాహనకు శిక్షణ శిబిరం నిర్వహింపబడింది. వారు మాట్లాడుతూ పరిపాలనలో గ్రామసభల నిర్వహణ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


సంబేపల్లె: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల అధికారులు, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

వీరబల్లి : మండలంలోని ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీఓ నూర్జహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండలంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ జయశ్రీ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు గురించి చర్చించారు.

సంబేపల్లె : గ్రామ పంచాయతీలలో సాధారణ కనీస పరిపాలనపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర శుక్రవారం తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యం, వ్యర్థాలు తొలగించడం, తాగునీటి సమస్య, విద్యుత్ దీపాలు, వైద్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సిద్దవటం : గ్రామ పంచాయతీలలో సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు గ్రామ పంచాయతీల పాలక వర్గం ఆమోదంతోనే ఏవైనా పనులు చేపట్టాల్సి ఉంటుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయం సభా భవనంలో శుక్రవారం మండలం లోని ఉప సర్పంచ్‌లకు వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం జరిగింది.

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో గ్రామాల సంక్షేమ అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ సోమశేఖర్ తెలిపారు. ముందుగా ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో కలిసి జ్యోతిని వెలిగించి మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.